


# రెండు సవర్ల బంగారం

- కొల్లూరి సోమశంకర్

రాత్రి భోజనాలయ్యాక పిల్లలు నాన్న చుట్టూ చేరారు. అమ్మ వంటింట్లో ఉంది. ఆ రోజు శుక్రవారం. రవి పిల్లలకి చెప్పాల్సిన కథ గురించి ఆలోచిస్తున్నాడు. రాత్రి భోజనాల తర్వాత పిల్లలకి కథ చెప్పడమనేది నిజంగా కష్టమైన పని. అందుకే మొదట్లో ప్రతిరోజు ఉన్న ఈ కథా కార్యక్రమం ఇప్పుడు శుక్రవారానికి మారింది. కాని ఈ సర్దుబాటు కూడా ఇబ్బందిగానే ఉంది. ఎందుకంటే ఏదో నోటికొచ్చిన కథ చెబితే పిల్లలు ఊరుకోరు.

నాన్న చెప్పేది ఏ టార్జాన్ కథో లేక ఫాంటమ్ కథో అయితే బాగుండని మగ పిల్లలిద్దరూ కోరుకున్నారు. అవికాక మరేదైనా అయితే

బాగుండని అమ్మాయి అనుకుంది. పాపం ఆ పిల్లల తల్లి బాగా అలసిపోయి ఉంది. ఏదైనా చిన్న కథైతే బాగుండు, త్వరగా పడు కోవచ్చు అని అనుకుంది. ఆ పిల్లల నానమ్మ అక్కడే కూర్చుని నిశ్శబ్దంగా ప్రార్ధన చేసుకుంటోంది. ఈ లోపల రవి తను చెప్పబోయే కథలోని పాత్రలు, వాటి పేర్లు, కథనాన్ని మననం చేసుకోసాగాడు.

"సరే, ఈరోజు నేను మీకో ప్రత్యేకమైన కథ చెబుతాను. ఈ కథ చాలా కాలం క్రితం.... అంటే మీరెవ్వరూ పుట్టనప్పుడు, 1947 కంటే ముందు, మనకి స్వాతంత్ర్యం రావడానికన్నా ముందు జరిగినది. అంటే సుమారుగా 1937-1940 మధ్యలో అనుకోండి. అవి మన జాతీయ నాయకులు బ్రిటీషువారి దౌర్జన్యాలను బహిరంగంగా ఎదుర్కుంటున్నరోజులు....

* * *

సేతు మాధవన్ తన చేతిగడియారాన్ని చూసుకున్నారు. చిన్నగా తల ఊపి అది, ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం మీది గడియారం రెండూ ఒకే సమయాన్ని సూచిస్తున్నందుకు తృప్తి చెందారు. ఆయనకు అన్ని వివరాలు కావాలి. ఓ స్టేషను మాస్టారుగా రైల్వేస్టేషనులోని చిన్నా, పెద్దా వస్తువులపై తనకు సంపూర్ణమైన బాధ్యత ఉన్నట్లు భావిస్తారాయన.

ఆయన తన చేతి గడియారాన్ని మరో సారి చూసుకున్నారు. సాయంత్రం 6 గంటల 21 నిమిషా లవుతోంది. క్విలాన్ నుంచి ఉత్తర భారతదేశం వెళ్ళే రైలొకటి ఆలస్యంగా వస్తోంది. "విరుదు నగర్" ఓ చిన్న స్టేషన్. ఆ స్టేషనుకి ఒకే ఒక ప్లాట్‌ఫాం ఉంది. దానిపేరు ప్లాట్‌ఫాం నెంబరు 1. సాధారణంగా ప్లాట్‌ఫాం నెంబరు 1 అని వినగానే, ఇంకా ఎన్ని ఉన్నాయో అని అను కుంటారు. ఇప్పుడు రాబోయే బండి ఈ స్టేషన్లో ఆగదు. ఆకుపచ్చ జండా ఊపి, రైలును పంపడమే ఆయన చేయాల్సిన పని. అయితే మరో అరగంటలో రామేశ్వరం నుంచి మరో రైలు వస్తుంది. ప్రస్తుతానికి కంగారు పడాల్సిం దేమీ లేదు. సేతు మాధవన్ చుట్టూ చూశారు. స్టేషన్ అభివృద్ధి చెందిన తీరు ఆయనకి సంతృప్తి నిచ్చింది. ఆయన ఇక్కడ ఛార్జి తీసుకున్నప్పుడు స్టేషన్ దారుణంగా ఉండేది. మనుషులకీ, కుక్కలకి, ఇతర పశువులకీ ఆవాసంగా ఉండేది. రోగకారక క్రిములకీ పుట్టినిల్లులా ఉండేది. ఎవరికీ బాధ్యత ఉండేది కాదు. కాని ఆయన వీటన్నింటిని మార్చడానికి పూనుకున్నారు. రామేశ్వరంలోను, ధనుష్కోడిలోను ఇంకా ఇతర అనేక ప్రాంతాలలోను పని చేసిన అనుభవం ఆయనకీ ఉంది. రోజు రోజుకీ, కనీసం గూడ్సు బండి వేగంతోనైనా స్టేషన్ తన బద్ధకాన్ని వదిలించుకుంది. కొత్తరూపు దాల్చింది. కొత్తగా రంగులు వేసిన బోర్డులు, ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూమ్ దగ్గర తోరణాలు చోటు చేసుకున్నాయి. ప్రతిసోమవారం నాడు ఉదయం 5 గంటలకీ స్టేషన్ మొత్తాన్ని నియమంగా ఊడ్చసాగారు. టీ కొట్టులో ఈగలన్నీ మాయమయ్యాయి. ఓ శుభ ముహూర్తాన, ప్లాట్‌ఫాం నెంబరు 1 మీద, స్టేషన్ మాస్టర్ గది కెదురుగా ఓ పెద్ద గడియారాన్ని తగిలించారు.

ఈ ఉద్యోగం చేస్తున్నందుకు, బ్రిటీషు ప్రభుత్వం క్రింద పని చేస్తున్నందుకు ఆయనకు నామోషీ లేదు. తన కుటుంబ పోషణకీ కావాల్సినంత ధనం మాత్రం సంపాదించుకోగలుగుతున్నారు. ఆంగ్లం తెలిసిన కొద్దిమంది స్థానికులలో ఒకరాయన. ఈ ఉద్యోగం ఆయన పట్ల ప్రజలలో గౌరవాన్ని,ఆరాధనాభావాన్ని కలిగించింది. భారత జాతీయ కాంగ్రెస్ అంటే అభిమానం ఉన్నప్పటికీ, సక్రమమైన విధి నిర్వహణే అసలైన దేశభక్తిగా భావించే వారాయన.

ఆయన తన కాబిన్లోకి వచ్చారు. ఆయన భార్య 'పారు కుట్టి' తన చంటి పిల్లాడితో ఆడుతోంది. పదకొండేళ్ళ వైవాహిక జీవితంలో వారికి జన్మించిన ఐదో సంతానం ఆ బాబు. రోజూ సాయంత్రం పూట పిల్లలని స్టేషన్‌కి తీసుకొచ్చి రామేశ్వరం నుంచి వస్తూ అక్కడ పది నిమిషాల పాటు ఆగే రైలుబండిని చూపించడం ఆమెకి అలవాటు. పిల్లలు ఇంజనులోకి వెళ్ళి డ్రైవరు కాబిన్‌లో కూర్చుని ఆటలాడేవారు. అంతేకాక ఆ సమయంలో స్టేషనులోని టీ కొట్టు యజమాని నారాయణన్ వారికి ఏదో ఒక చిరుతిండి ఇస్తూనే ఉంటాడు.

భార్య చేతిలోంచి బాబుని తీసుకుని ముద్దు చేయసాగారు సేతు మాధవన్. ఇంతలో ఆయన సహాయకుడు గోవిందకుట్టి పరిగెత్తుకు వచ్చాడు. ఆయాసపడుతూ, గట్టిగా ఊపిరి తీసుకుంటూ...."సార్, సార్, పెద్ద సమస్య ఎదురైంది. కొన్ని ఫర్లాంగుల దూరంలో పట్టాల ఫిష్‌ప్లేట్లను ఎవరో తొలగించారని లైన్‌మెన్ కబురుపెట్టారు..." అని చెప్పాడు.




బందరు గ్రంథాలయ వికాస సమితి నిర్వహించిన స్వర్గీయ అయ్యంకి వెంకటరమణయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత డా॥ద్వా.నా. శాస్త్రి, డి.పి.ఆర్.ఓ శ్రీ కె.సదారావు సమితి అధ్యక్షులు శ్రీ దొండపాటి దేవదాసు, శ్రీ పి. రాజేశ్వరరావు, గుత్తికొండ సుబ్బారావు, ఎం.ఎస్.వి. సత్యనారాయణ బాబు తదితరులు వున్నారు.

సేతుమాధవన్ కంగారుపడలేదు. ఈ పని ఎవరో బడిపిల్లలదే అయి ఉంటుంది. పరిపక్వం కాని జాతీయ భావాలతో, స్వాతంత్ర్యం పొందాలనే తపనతో చేసే పనులవి. బండి నిండా ఉన్న జనాల ప్రాణాల గురించి ఏ మాత్రం ఆలోచించని ఆవేశం...!

"గోవిందా, నువ్వు స్వయంగా అక్కడికి వెళ్ళి, మరమత్తులు చేయించు. అన్ని సక్రమంగా ఉండేట్లు చూసి, రైలును ముందుకు పంపాలా వద్దా అని నాకు సిగ్నల్ ఇవ్వు... " అన్నారు సేతు మాధవన్ శాంతంగా. గోవింద కుట్టి పరిగెత్తాడు.

తనకేసి ఆందోళనగా చూస్తున్న భార్యకి బిడ్డనందిస్తూ, "కంగారు పడకు. ఇవన్నీ మాకు మామూలే. మేం సిద్ధంగానే ఉన్నాం..." అని చెప్పారాయన చిరునవ్వుతో.

ఆయన కంట్రోల్ టవర్ ఎక్కి చూడసాగారు. ముందు గోవిందకుట్టి వస్తాడా? లేక రైలు వస్తుందా? ముందుగా రైలే వచ్చింది.

పన్నెండేళ్ళ వృత్తి అనుభవం గల సేతు మాధవన్ కంగారు పడలేదు. రైలు ముందుకు వెళ్ళడానికి వీలుగా ఇవ్వాల్సిన 'గ్రీన్‌సిగ్నల్' ఇవ్వలేదు. రక్షణ ముఖ్యం కదా! అంతమంది ప్రాణాలు ప్రమాదంలో ఉంటే, బండి కొంత ఆలస్యమైనా పరవాలేదు. ఒకవేళ ఏదైనా విచారణ జరిగినా పై అధికారులు అర్థం చేసుకుంటారు. కాని విచారణ జరగడం అనేది అనూహ్యం ! రైళ్ళు గంటలకొద్దీ ఆలస్యంగా నడుస్తుంటాయి. వాటి పై విచారణ జరగడం అనేది ఎన్నడూ వినలేదు.


అసలు కారణం తెలియని డ్రైవరు, గ్రీన్‌సిగ్నల్ లేకపోవడంతో చికాకు పడ్డాడు. రైలు పెద్దగా శబ్దం చేసుకుంటూ వచ్చి ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం మీద ఆగింది. వెంటనే స్టేషనంతా ఒక్కసారిగా చైతన్యవంతమైంది. "కాఫీ, టీ, ఇడ్లీ, వడ, దోస, న్యూస్‌పేపర్లు, బొమ్మలు..." ఇలా రకరకాల వస్తువులు అమ్ముకునే వాళ్ళు బోగీల వద్ద చేరి బేరాల కోసం ప్రయత్నించ సాగారు. పారుకుట్టి ప్లాట్‌ఫాం మీదకి వచ్చి బాబుకి రైలు బండిని చూపించసాగింది. అక్కడ జరుగుతున్న హడావుడినంతా, కేవలం పసిపిల్లలకి మాత్రమే సాధ్యమైన హావభావాలతో చూడసాగాడా బాబు. ఆ బాబు తోబుట్టువులు అప్పటికే డ్రైవరు దగ్గరికి చేరి కాబిన్లోకి వెళ్ళడానికి బోల్డు కబుర్లు చెబుతున్నారు. పారుకుట్టి కంట్రోల్ టవర్‌కేసి చూసింది. సేతుమాధవన్ ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించినా, గోవిందకుట్టి ఇచ్చే 'ఆల్‌క్లియర్ సిగ్నల్' కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నారని గ్రహించింది. అక్కడ్నించే ఆయన ఆమెకేసి చూసి, భరోసా ఇస్తున్నట్లు చిన్నగా నవ్వారు.

అప్పుడే ఆ సంఘటన జరిగింది. ఓ జనరల్ కంపార్ట్‌మెంట్ ముందు తచ్చాడుతున్న జనాలు కొందరు ఉద్వేగంగా కేకలు వేయసాగారు. కొన్ని క్షణాలతర్వాత, ఓ ముసలాయన బోగీ తలుపు దగ్గరికి వచ్చి నిలిచారు. ఓ చిన్నపంచ, భుజం పైన కండువాతో ఉన్నా రాయన. ఆయన రూపమేమీ విలక్షణంగా లేదు. ఆయన యాత్రలకు వెళ్ళివస్తున్న ఓ తాతగారు కావచ్చు లేదా ధనుష్కోడిలో సంభవించిన వరద బాధితులు కావచ్చు. అయితే బోగీ వద్ద గుమిగూడిన జనాలు ఆయనకు మొక్కి, ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు.

ఇంతలోఎవరో "ఇంక్విలాబ్ జిందాబాద్" అని గట్టిగా అరిచారు. ఆ కేక స్టేషన్ అంతా ప్రతిధ్వనించింది. జనాలందరూ ఆ ముసలాయన కేసి పరిగెత్తుతున్నారు."ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్‌మాతా కీ జై" వంటి నినాదాలు మారుమ్రోగుతున్నాయి. ఆ ముసలాయన స్వాతంత్ర్య సమరయోధుడిలా ఉన్నారు. ఈ ప్రాంతాలలో ఆయ నను గుర్తించేవారిసంఖ్య బాగా తక్కువైనప్పటికీ, బహుశా పేరుగాంచిన నేత అయి ఉంటారు. జనాలందరూ మిగతా బోగీల నుంచి దిగి ఆ బోగీ వైపు పరిగెడుతున్నారు. ఆయనకు నమస్కరించి ఆయన ఆశీస్సులు తీసుకోవాలని తాపత్రయపడుతున్నారు. ఆ ముసలాయన అందరికేసి చేతులు ఊపి, వినమ్రంగా నమస్కరించి, చిరునవ్వుతో నిలబడ్డాడు. తనతో కరచాలనం చేయాలని ప్రయత్నిస్తున్న వారి చేతులను మెల్లగా తాకారాయన.

ఉన్నట్లుండి ఆ ముసలాయన తన భుజం మీది కండువాని తీసి జోలెలా పట్టుకున్నారు. దూరం నుంచి చూస్తున్న సేతుమాధవన్‌కి ఇదేం అర్థం కాలేదు. జనాలు అంతకన్నా విచిత్రంగా ప్రతిస్పందించారు. మగవాళ్ళు తమ జేబుల్లోని డబ్బంతా ఆ జోలెలో వేసారు. విక్రేతలు వీలైనంత చిల్లర గుప్పెళ్ళతో తీసి కండువాలో పోసారు. ఆ మూట క్రమంగా బరువెక్కసాగింది. అరటిపళ్ళు అమ్ముకునే ఓ పేద చిరువ్యాపారి ఓ డజనువళ్ళను ఆ మూటలో వేసాడు.

జరుగుతున్న తతంగాన్నంతా టవర్ పైనుంచి చిద్విలాసంగా చూస్తున్నారు సేతు మాధవన్. జనాలని తోసుకుంటూ, చేతిలో బాబుతో పారుకుట్టి ఆ ముసలాయన వైపు వెళ్ళడం చూసారు. ఆయన ముఖంపై నవ్వు మాయమైంది. ఆ ముసలాయన చంటి బిడ్డతో తనకేసి వస్తున్న పారుకుట్టిని గమనించారు. ఆమెని జాగ్రత్తగా తీసుకురమ్మని తన



సహాయకు లకు సూచించారు.ఆమె దగ్గరకు రాగానే, తన చేతిలోని ఆ బరువైన మూటని ఓ సహాయకు డికి అందించి పారుకుట్టి చేతులలోని బిడ్డను ఎత్తుకుని, నుదుటిపై ముద్దు పెట్టారు. ఆ బాబు కిలకిలా నవ్వాడు. పారు కుట్టి తన భావోద్వేగాలను అణచుకోలేక, గట్టిగా ఏడవ సాగింది. ఆ ముసలాయన ఆమెని సము దాయించి బిడ్డని అందించారు. తర్వాత ఓ చిరు నవ్వు నవ్వి, పారుకుట్టి కేసి చేతులను జోలెగా చేసి దోసిలి పట్టారు. ఒక్కక్షణం పాటు పారు కుట్టి సందేహించింది. తర్వాత నిస్సం కోచంగా తన బంగారు గాజులను తీసి ఆయన దోసిలిలో వేసింది. సేతుమాధవన్ తన కళ్ళని తానే నమ్మ లేక పోయారు. రెండు సవర్ల బంగారంతో చేసిన గాజులవి. పైగా తన మామగారిచ్చిన ఆస్తి ! పారుకుట్టి దాతృత్వం వల్ల ఎంత నష్టపోయింది ఆయన మనసులోనే లెక్కలు వేసుకున్నారు. ఇంతలో గోవిందకుట్టి నుంచి 'ఆల్ క్లియర్ సిగ్నల్' రావడంతో, అన్ని ఆలోచనలను పక్కన బెట్టి, రైలును పోనివ్వ మంటూ పచ్చజెండా ఊపారు. వెంటనే ఆ రైలు విరుదునగర్ స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబరు 1 నుంచి కదిలిపోయింది.

కాసేపయ్యాక, సేతుమాధవన్, ఆయన కుటుంబం నిశ్శబ్దంగా తమ ఇంటికి చేరు కున్నారు. దారిపొడవునా పారుకుట్టి మౌనంగానే ఉండిపోయింది. ఆ ముసలాయన దీవెనలు పొందిన తన కొడుకుని చూసి మురిసి పోయింది. రెండు సవర్ల బంగారం ప్రస్తావన మరో సారి తేవడం మంచిదని అను కున్నారు సేతుమాధవన్.

* * *

పిల్లలు అసహనంగా అటూ ఇటూ కదిలారు. 'కథ' అయిపోయిందో లేదో వాళ్ళకీ అర్థంకాలేదు. చాలాసేపు మాట్లాడకుండా ఉండి పోయారు. చివరికి పదేళ్ళ పాపాయే నిశ్శబ్దాన్ని భగ్నం చేసి, "నాన్నా, ఆ ముసలాయన ఎవరు? ఆయన దీవెనలు రెండు సవర్ల బంగారమంత విలువైనవా?" అని అడిగింది.

రవి చిన్నగా నవ్వి, "ఆ సంగతి మీ నానమ్మని అడగండి..." అని అన్నాడు. పిల్లలు పోలోమంటూ నానమ్మ దగ్గరికి చేరారు.

"గాంధీ మహాత్ముని దీవెనల ముందు రెండుసవర్ల బంగారం ఏ పాటి?" అంది పారుకుట్టి మనవలతో.

రవి కళ్ళు మూసుకుని, కుర్చీలో విశ్రాంతిగా వెనక్కి వాలి అంతర్లీనంగా ప్రశాంతతని అనుభవించసాగాడు.

అతడి ఆలోచనల్ని భగ్నం చేస్తూ, "ధన్యులైన శ్రీవారు, ఓ కప్పు కాఫీ కావాలా?" అని అడిగింది అతడి భార్య.

## ప్రశ్న

దేవుణ్ణి నమ్ముతున్నావా
ఎవరో ప్రశ్నించారు

నమ్ముతున్నవాళ్ళు
ఎందరో ఉన్నారు
అది వాస్తవం.

కనిపించడం లేదు కాబట్టి
లేదని
కొందరు భావిస్తున్నారు
అది మరొక వాస్తవం

నమ్ముతున్నవాళ్ళకు
ఉన్నట్లు కనిపించడం లేదు
నమ్మని వాళ్లకు
లేదనే నమ్మకం కుదరడం లేదు

దీర్ఘకాలం ఆగి,
జవాబిచ్చాను

దేవుణ్ణి నమ్ముతున్నానో లేదో
ఖచ్చితంగా చెప్పాలా
అసలట్లా చెప్పగలగడం
ఉంటుందా

- కొప్పర్తి



నా గురుదేవులు
శ్రీ మురుగ భూషణమ్‌గారు
(నవశక్తి నిలయమ్, చెన్నై)

భారతదేశములో అతిపెద్ద జ్యోతిష్య గ్రంథాలయము గల ఏకైక సంస్థ

సాయి త్రిశక్తి నిలయమ్

(జ్యోతిష్య పరిశోధనా కేంద్రం)


రాజర్షి - బ్రహ్మర్షి
దైవజ్ఞ కె. అచ్చిరెడ్డి B.sc.,
జ్యోతిష్య - రత్న - వాస్తు శాస్త్ర - పరిశోధకులు

ESTD : 1977

సరస్వతీ మహల్, MIG 132/1, HB కాలనీ, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ - 520 012 ఫోన్: 2417796

జ్యోతిష్య వాస్తు - హస్త సాముద్రిక - రత్న శాస్త్రాలలో సుమారు 30 సం॥రాల అనుభవజ్ఞులు, దేవీఉపాసకులు, దైవజ్ఞ - రాజర్షి బ్రహ్మర్షి కె. అచ్చిరెడ్డి గారు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖుల భవిష్యత్ ఫలితాలను చెప్పి మన్ననలు పొందియున్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు - సత్కారాలు పొందియున్నారు.